పాపం సీతారామయ్య

శివల జగన్నాథరావు

'టప్' మని తలమీద ఏదో పడటంతో చదువుతూన్న భాగవతాన్ని ప్రక్కన పెట్టి, తల తడుముకున్నాడు, సీతారామయ్య చేతి లోకి ఒక గడ్డిపోచ వచ్చింది. ఓసారి మీదికి చూసి సీతారామయ్య గుప్తంగా నవ్వుకున్నాడు. ఆ నవ్వులో ఉండవల్సిన సహజత్వం లేదు. ఆ స్థానంలో ఏదో వెలితి, పూడుకుపోయిన బాధ, ఆలోచనల కెరటాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతాన్ని వదిలి పూర్వాన్ని గుర్తు చేసిన ఆ గడ్డిపోచ అతని చేతినుండి దూరంగా విసిరేయబడింది. అందుకోసమే నిరీక్షిస్తున్నట్లుగా ఆ గడ్డిపోచని రివ్వున వచ్చి అందుకుని గూటిని చేరుకుంది పిచ్చుక. అలా అది కొన్ని వందలసార్లు చేస్తూంది.

వానా హైరానాపడి గూటికోసం గడ్డి పోచలు తేవటం, వాటిని చూతు మధ్య వాసం మీద నిల్చబోతే అవి విలవిల పడి పోవటం, మళ్ళీమళ్ళీ ఇదే పని! పెట్టే గూటికి ఆదిలోనే విఘాతం వస్తుందని తెలిసి వాటికా తాపత్రయం దేనికి? ఆ గూడు ఎప్పటికైనా నిలుస్తుందని తమ కష్టానికి ఫలం దక్కకపోదని ఆత్మవిశ్వాసమా, వాటికి? లేక ప్రతిఫలాపేక్ష లేని ఒకవిధమైన వ్యాసంగమా వాటికది?!... ఏమైనా పాపం, వాటిది ఎవ్వరూ మెచ్చని కష్టం...

మరో గడ్డిపరక... కాదు! పీచు ఒళ్ళో వచ్చి పడింది. సీతారామయ్య నిర్జీవంగా నవ్వుకున్నాడు. దాదాపు బోసిగా ఉన్న వాసం చివర్న ఆడ, మగ పిచ్చుకలు రెండూ గోలగా అరుస్తున్నాయి గెంతుతున్నాయి. అటే చూస్తూండిపోయాడు సీతారామయ్య.

* * *

చెల్లి పుట్టింది!'

తెలుగు పేరియడు ...

ఈ వార్త సీతారామయ్య చెవిన పడింది. అయిదోక్లాసులో, నాలుగో బెంచీ మీద, రెండో వరసన కూర్చున్న సీతారామయ్య అనే పదేళ్ల అబ్బాయి గభాలున లేచి మాస్టారేదో అనబోతే, వినిపించుకోకుండా ఇంటికి పరుగుతీశాడు. తెలుగు మాస్టారు తెల్లబోతూ ఉండిపోయారు.

సీతారామయ్య అంత ఉత్సాహి కుడు కావటానికి కారణం అతని తర్వాత తల్లికి మరి సంతానం లేకపోవటమూ, అతనికి చెల్లి కావాలనే బలమైన కాంక్షానూ.

అతడి స్నేహితులు బుచ్చిబాబు, సోమిశెట్టి, కన్నారావూ వీళ్లందరికీ ఒక్కొర్కూ, ఇద్దరూ చెల్లెళ్ళున్నారు. వాళ్లకి చెల్లెళ్లుంటే తనకేమిటని సీతారామయ్య పూరుకునే వాడేమోగాని వాళ్లలా అతడిని పూరుకోనివ్వలేదు.

'ఎంచక్కా, మాకు ఇంతమంది చెల్లాయి

లున్నారు. నీకు చెల్లాయిలు తమ్ముళ్ళు ఎవరూ లేరు. ఒంటిపిల్లి రాకాసివి.'

ఇలా రకరకాలుగా ఆతడిని గేలిచేసే వాళ్ళు. సీతారామయ్యకి వెంటనే పౌరుషం తన్నుకు వచ్చేది. తనకీ చెల్లాయి వుంటే వీళ్ళిలా వెక్కిరిద్దురా? అనుకునేవాడు.

సీతారామయ్యకి చెల్లి కావాలనే కోరిక తీవ్రమవడానికి మరో సంఘటన కూడా తోడయింది.

బుచ్చిబాబుకీ సీతారామయ్యకీ ఓనాడు ఏదో విషయం మీద జగడం వచ్చి, అది పెరిగి కొట్లాటలోకి దిగింది. స్వతహా బలిష్టుడైన సీతారామయ్య చేతిలో బుచ్చిబాబు చావుదెబ్బలు తినేవాడే, గాని, ఆ ఇద్దరూ ఊహించని విధంగా బుచ్చిబాబు నలుగురు చెల్లెళ్ళు ఒక్కుమ్మడిన వచ్చి, సీతారామయ్యని ఒక్కడిని చేసి! అన్నతో కలిసి అతడిని మెత్తగా తన్నారు. ఆ అయిదుగురి ముందు తనబలం చాలలేదు, సీతారామయ్యకు.

ఎన్ని శక్తులున్నా ఏ వ్యక్తీ ప్రపంచంలో నాకేమని ఒక్కడూ బ్రతకలేడు. ఏదో ఒక ఆసరా...సర్వదా అతడి క్షేమం కోరే ప్రాణి ఉండాలి. వెనక నీడలా నిలిచి, నీకు నేనున్నాననే ధైర్యం ఏర్పరచినపుడు, ఎన్ని ఒడిదుడుకుల్ని కూడా ఆ వ్యక్తి నిర్భయంగా, సుకరంగా దాటగలడు!

ఇంతవరకు అప్పుడు సీతారామయ్య ఆలోచించకపోయినా, తన వారనే మనిషి ఒకరు తోడు ఉండటం అత్యవసరం అనిపించింది అతనికి.

తనకున్న లోటుని, అసమర్థతను పదే పదే వెల్లడిచేసి, హేళనచేసే స్నేహితులను ఏమీ చెయ్యలేక, నాన్న ఎదుట తన కోరికను బయటపెట్టడానికి జంకు గనక, అమ్మ మీదికి దండయాత్ర చేసేవాడు.

'అమ్మా, నాకు చెల్లి కావాలే'

'నువు నాకు చెల్లినిస్తావా, లేదా చెప్పమ్మా'

తన నోటివెంబడి ఈ ప్రశ్న విన్న నాలుగైదుసార్లూ తల్లి ముసిముసిగా నవ్వుకోవటమూ, మౌనంగా వుండిపోవటమూ సీతారామయ్యకు ఉడుకుమోత్తనం తెప్పించింది. నిరాహారదీక్ష చేశాడు. మౌనవ్రతం పట్టాడు. ఎంత సమరం సాగించినా తల్లీ, తండ్రీ బ్రతిమాలటమూ, ఓదార్చటమూ, మందలించటమే చేస్తున్నారుగాని, చెల్లినిచ్చే ఉద్దేశం కనపరచరెందుచేత ? అని తీవ్రంగా మథనపడ్డాడు. చివరికి, తను వాంఛించింది లభ్యమవనపుడు మనిషిలో చోటుచేసుకొనే నిస్పృహ సీతారామయ్యను ఆవరించింది.

ఇలా ఉండగా, ఓనాడు సీతారామయ్య తల్లి, అతను బడినుంచి వచ్చేసరికి చెప్పనే చెప్పింది తియ్యని కబురు. ఎగిరి గంతేశాడు. పుస్తకాలు ఆఘళాన పడేసి, రివ్వున ఇంట్లోంచి పరిగెత్తి, గర్వంగా స్నేహితులందరితో చెప్పేశాడు. వాళ్ళు నవ్వారు.

'చెల్లే పుడుతుందని నీకెలా తెలుసోయ్? మా రెండో చెల్లి పుట్టినపుడు మా ఇంట్లో అందరం నాకు తమ్ముడు పుడతాడని పందాలుకూడా వేసుకున్నాం. చివరికేమయింది?' అన్నాడు వాళ్ళలో ఒకడు.

సీతారామయ్య చిన్ని గుండెలో సంతోషమంతా ఇగిరిపోయింది.

ఆ రాత్రి అన్నం తింటున్నపుడు తల్లితో అన్నాడు: 'అమ్మా, నాకు తమ్ముడు పుడితే వాణ్ణి చంపేస్తాను. నాకు చెల్లే కావాలి.'

'ఛా! వెధవకానా! ఎవరయితేనేం ? పోనీ చెల్లే పుడుతుందిలే. ఊరుకో' ఆవిడ నవ్వుతూ కసిరింది కొడుకుని.

సీతారామయ్య ముందుగా ఏర్పాటు చేసుకున్న ప్రకారం అతడికి చెల్లే పుట్టిందనే వార్తని ఇంట్లో పనిచేసే కుర్రాడు మోసుకొచ్చి అతడి చెవిన వేశాడు. ఏ వార్తకోసమైతే సీతారామయ్య ఇన్నాళ్ళుగా ఎదురు చూస్తున్నాడో, అదే వినిపించినపుడు తను ఉన్నది బడిఅయితేమటుకు అక్కడ ఎలా నిల్చి ఉండగలడు ?

బడినుంచి పదినిముషాల్లో ఇల్లు చేరుకున్న సీతారామయ్య చెల్లిని చూడాలనే తహతహలో గుమ్మానికి కాలుతగిలి బోర్లాపడ్డాడు. అప్పుడే లోపల్నుంచి వచ్చిన అమ్మమ్మ 'అయ్యోపాపం' అనకుండా 'అఖండుడివిరా అన్నమాట నెగ్గించుకున్నావు' అంటూ లేవదీసింది. సీతారామయ్య ముణుకు సర్దుకొంటూ అమ్మగదిలోకి వెళ్లాడు. తెల్లటి పక్కమీద బంగారపు బొమ్మలా మెరిసిపోతుంది చెల్లాయి. వెంటనే ఎత్తుకుని ముద్దుపెట్టుకోవాలనిపించినా, తన మురికి చేతులతో తాకితే మాసిపోతుందేమో అనుకొని అప్పటికి వూరుకున్నాడు. ఆ రోజునుంచీ తన అపురూపమైన చెల్లెల్ని పైవాళ్ళనెవర్నీ ముట్టనిచ్చేవాడు కాడు. కన్నుచాటయి ఎవరేనా పాపని చేరితే నానాహంగామా చేసేవాడు. పాపపేరు వాణి.

వాణి మూడేళ్లదై వుండగా ఆ పిల్లకి ఓనాడు ఘోళ్ళున జ్వరం వచ్చింది. ఇంట్లో అందరూ పిల్లచుట్టూ మూగి కంగారు పడుతూంటే సీతారామయ్య అక్కడ ఉండకపోవడం తండ్రికి విస్మయం కలిగించింది. 'ఇదేమిటి ? చెల్లి చెల్లంటూ తిరిగే వీడు ఎక్కడికిపోయాడు చెప్మా!' అనుకొని ఇల్లంతా వెతికారు. దేముడుగదిలో రెండు చేతులు జోడించి కళ్ళుమూసుకు నిలుచున్నాడు సీతారామయ్య. 'ఏరా, ఇక్కడేం చేస్తున్నా' వంటే, 'చెల్లికి వేగిరం జ్వరం తగ్గించెయ్యమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా'నన్నాడు.

'వీడికెంత ఆపేక్షో చెల్లెలిమీద, చూశారా!' అని ఆ ఇంట్లో ఆశ్చర్యంగా చెప్పుకున్నారు అంతా.

వాణి ఆరేళ్లదయింది. ఇప్పుడు చెల్లి తప్ప వేరేలోకములేదు సీతారామయ్యకు. ఆటా, చదువూ అన్నీ ఆపిల్లతోనే. బడినుంచిరాగానే 'ఒరే అన్నయ్యా' అంటూ వాణి ఎదురువెళుతుంది. పుస్తకాలు అక్కడే వదిలేసి చెల్లెల్ని గభాలున ఎత్తేసుకొని ముద్దులవర్షం కురిపిస్తాడు. తన పుస్తకాలు దగ్గరపెట్టి చెల్లికి చదువు నేర్పడానికి, ఆమెను తనతో సమానమైయిదాకి తెచ్చేయటానికి, సీతారామయ్య పడే తంటాలు చూస్తే ఆ తల్లిదండ్రులకి గర్వం, ఆనందం ఒక్కుమ్మడిన కలిగేవి.

గవర్నమెంటు గుమాస్తా చేస్తున్న విశ్వపతికి తను ఉన్నా లేకపోయినా కొడుకు కూతురుకేమీ లోటువెయ్యడన్న ధీమా; వాడి అభిమానం చూస్తే తను తిన్నా, తినకున్నా చెల్లెల్ని సుఖపెట్టగలడన్న స్థయిర్యం కలిగేవి. 'అవి చాలవేనాకు?'అని అని అతను గర్వంగా చెప్పుకొంటే ఏమన లేక సజల నేత్రాలతో చూసేది భార్య!

సీతారామయ్య ఎస్సెల్సీ దాటేసరికి వాణి పుస్తకం పూర్తిచేసింది. సీతారామయ్య ఇంటరులో చేరాడు.

ఇంటరు పూర్తయేలోపునే అతను తన తలకి మించిన బరువైన సమస్యల్ని ఎదుర్కొనవలసివచ్చింది. మహమ్మారిలా ఆ ఊర్లో విరుచుకుపడిన కలరా అనేకమందితో బాటు సీతారామయ్య తండ్రినీ కబళించి

పోసింది. ఇంటి కప్పు కూలిపోయినా విశ్వపతి బ్రతికున్నరోజుల్లో వచ్చే ఆదాయం ప్రాలక, ఇల్లు గడవటానికిచేసిన అప్పులకి పరిహారంగా ఉన్న ఇల్లు చెల్లు అయింది.

గాలివాన ఉధృతానికి ఏటో దిక్కుచేరిన పక్షికూటమిలాగా ఒక అద్దెపంచలో తల దాచుకున్నారా ముగ్గురూ. ఇహ పైసాకి చెల్లనమకున్న సీతారామయ్యకు కారు చీకటిలో కాంతిరేఖలాగా ఉద్యోగం దొరికింది. గుట్టుచప్పుడుగా రోజులు వెళ్ళబుచ్చుతున్నారు కాలం సవ్యంగా సాగితే, మనిషికి సమస్యలే లేకపోతే అది జీవితమే అనబడదేమో! అంతలోనే మరొక దెబ్బ!' చెల్లెలి ఇంటిదాన్ని చెయ్యవలసిన పూచీ నీకే ఉన్న'' దని చెప్పి ఓ అర్ధరాత్రి అనుకోకుండా వచ్చే పిలుపుని అందుకుని వెళ్ళిపోయింది, సీతారామయ్య తల్లి!

కష్టాలు మానవులకి రాకపోతే మానవతికి ఉనికేదీ?

ఇబ్బందులు పేకదొంతర్లులాగ ఒక దానిపై ఒకటి చెప్పి మరీ పడతాయా అని చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పే కబుర్లు ఒక్కొక్కటే అనుభవంలోకి వచ్చి పడుతూంటే తలబొప్పి కడుతూంది పాపం, సీతారామయ్యకి పైకి ఏడ్వటానికయినా చెల్లెలికి అవకాశం ఉంది. తనకదీలేదు! దాని ముందు కళ్ళనీరు పెట్టుకుంటే గుండె లెత్తిపోతుందని చాటుగానే కుమిలేవాడు. ఇరవై ఏళ్ళకే అరవై ఏళ్ళ అనుభవాల్ని

పాపం సీతారామయ్య

సంతరించుకున్నాడు, మానసికంగా బదుగైన సీతారామయ్య!

పుత్తడిబొమ్మ అవనీ, సుగుణాలరాశి అవనీ, మూడుముళ్ళు మెడలో పడటానికి ఈ అర్హతలెందుకూ పనికిరావు. పెళ్ళికొడుకులతో సీతారామయ్య సమరం సాగిస్తుండగానే వాణి పైటకట్టింది. ఇప్పుడామెలోకం పోకడని అర్ధం చేసుకోగలుగుతూంది. అన్నతో 'ఎందుకురా ఈ తిప్పలన్నీ నువ్వింత ఇబ్బందిపడుతూ నాకు పెళ్ళిచెయ్యకపోతే జరగదా ఏమిటి మనకు? నన్ను ఇంకా చదివించు. ఉద్యోగంచేస్తాను' అంటూంది. అన్నగారు నవ్వి ఊరుకునేవాడు. అతనికి తెలుసు కబుర్లు వాస్తవం ముందు నిలువవని.

తనకి చాలామంది స్నేహితులున్నారు అశేషమైన ఆశయాలకోసం అరుచుకునేవాళ్ళున్నారు. స్టేజిలెక్కి గొంతులు చించుకునేవాళ్ళున్నారు. తను చెప్పే ఆశయం కోసం, స్నేహితుడు అనే సత్సంకల్పబుద్ధితో అతడి చెల్లెల్ని మనువాడే మొనగాడేలేడు.

సీతారామయ్య గ్రైరేతోక జీతంలోనే అష్టకష్టాలుపడి వెయ్యిరూపాయలు కూడగట్టి, మరికొంత అప్పుచేసి ఓ సంబంధం తెచ్చాడు. పెళ్ళికొడుకు మూలగకపోయినా అత్తమామలు చిరుబురులాడారు. ఆడబడుచులు ముష్టికట్నం అంటూ మూతులు మూతెడిటూ బారెడిటూ ఆడించారు. ఏతేతే మన్నా పెళ్ళిమాత్రం ఆగిపోలేదు. అందుకు ఆనందించాడు సీతారామయ్య ఇటు ఎవరూ లేనందున అత్తవారివేపే పందిరి విస్తళ్ళు లేచాయి.

అత్తగారి హయాంలో వాణి నరకం అనుభవించింది. ఇంటెడు చాకిరీ, ఏపనిలోనూ సంతృప్తి కనపరచకపోగా సాధింపులు, మనసుని చిల్లులు పొడిచే దూషణలు ఆమెకు అత్తవారింట్లో లభించేవి. అత్తవారింటికి సాగనంపుతూ వాణికి ఇరవై కవర్లు, కార్డులు వగైరా సరంజామా చేతికి ఇచ్చాడు సీతారామయ్య తరవాత చెల్లెలునుండి తనకు ఒక్క ఉత్తరమైనా రాలేదే అని వాపోయాడు. పెళ్ళయిన మొదటి పండుగకి చెల్లెల్నీ బావమరిదిని ఆహ్వానించబోగా అవమానం ఎదురయింది కట్నం తప్పితే ఒక్క లాంఛనమైనా చెల్లించని ఆ దౌర్భాగ్యపు పుట్టింటికి వెళ్ళకపోతే ఏ మొచ్చింది అని వాణిని అత్తగారు ఆపివేసినట్లు ఆమెనుండి ఉత్తరం వచ్చింది.

చెల్లెల్ని చూడకుండా ఒక్కగంటయినా ఉండలేని సీతారామయ్య పండగకి పిలవటం పేరుతోనైనా చెల్లెల్నితెచ్చి పదిరోజులు ఉంచుకోవచ్చు అని పడిన ఆశ నిరాశే అయింది ఇక ఉండబట్టక చెల్లెలికి బావమరిదికి కొన్న బట్టలు పట్టుకుని అత్తవారింటికే ప్రయాణమయ్యాడు.

ఏదో పనిమీద కొంగుకు చేతులు తుడుచుకుంటూ సావిట్లోకి వస్తున్న వాణి, గుమ్మం అవతల పంచి కట్టుకు నిల్చున్న అన్నగార్ని చూచి సంతోషం ముప్పిరిగొనగా 'అన్నయ్యా!'' అంటూ ముందుకి వెళ్ళబోయింది అంతలో అత్తగారు మహంకాళిలా వచ్చి ఇద్దరికీ నడుమ నిల్చుని తలుపులు భళ్ళున మూసేసింది.

తనకి జరిగిన ఈ అవమానం సీతారామయ్యను కలతపరచలేదుగాని, ఆరెండు నిముషాల వ్యవధిలోనూ కనిపించిన చెల్లెలిరూపం అతడిని కంటతడిపెట్టించింది.

ఎముకలు తేలి, కళ్ళు లోతుకుపోయి అస్థిపంజరంలా కనిపిస్తున్న వాణి, తను అపురూపంగా చూచుకొన్న వాణేనా అనుకొంటూ, పిచ్చివాడిలా అయిపోయి తిరుగుముఖం పట్టాడు.

బావ భద్రాచలంకి బందరు బదిలీ అయిందని సీతారామయ్యకి తెలిసింది. చీకట్లో



కొట్టుకుంటున్న వాడికి ఏదో వెలుగు కని పించినట్లు ఆనందించాడు భార్య తీసుకుని భద్రాచలం బయల్దేరిన పదిరోజులకే తనూ బందరుకి మకాం మార్చేసుకున్నాడు సీతారామయ్యకు అత్తగారితో వైరంగాని బావతో ఎన్నడూ వైరంలేదు బావ తమిం ట్లోనే ఉండమన్నాడని ఇంకా మురిసి పోయాడు

ఉదయం బజారుపని తర్వాత ఉద్యోగం సాయంత్రం చెల్లెమ్మ పిల్లల్ని ఆడించటం

చెల్లెమ్మ సామీప్యంలో ఉండగలిగే అదృష్టం పట్టిందన్న తృప్తి, ఇంతకంటే వేరే ఏం కావాలనే నిర్విచారంతో దినాలు, మాసాలు, సంవత్సరాలు దొర్లించేస్తున్నాడు, సీతారామయ్య, వాణి అత్తవారింటికి కాపు రానికి వెళ్లిన రోజుల్లో ఏమీచక క్షణం ఒక యుగంలా గడచిన సీతారామయ్యకు ఇప్పుడు తన గురించి ఆలోచించుకుందికి కూడా తీరుబడి లేనంత త్వరితంగా కాలం పరిగెడుతూంది

'ఏమండోయ్ సీతారామయ్యగారూ, ఎటు ఇలా బయల్దేరారు?'

'ఇదుగో ఈ చంటిదానికి నిన్న రాత్రి నుంచి ఒకటే జ్వరం, డాక్టరుకి చూపిద్దా మని తీసుకువెళుతున్నాను'. .

మరోకసారి రోడ్డుమీద—'అంత హడా వుడిగా పరిగెడుతున్నారేం, సీతారామయ్య గారూ ఇంట్లో ఎవరికైనా '

'అబ్బెబ్బే అదేం లేదులెండి, ఈ కూరల వెధవలున్నారు చూశారూ బజా రికి వెళ్లడానికి బద్ధకించి వాడికలు పెట్టు కుంటే వాళ్లిష్టం మొచ్చిన ధరలు చెబుతూ, చచ్చుపీ, పుచ్చుపీ అంటగడు తున్నారు పదడుగులు నడిచి తెచ్చుకుంటే ఈ బాధలుండవు చూడండి మరి పన్నెను అరగంటలో తిరిగి రాకపోతే ఆఫీసు కందను .' పరిగెడుతూనే జవాబు

పెద్ద మేనకోడలు పదేళ్లదాన్ని ఫస్టు ఫారంలో చేర్పించాలి

కడసారి దానికి హాస్పిటల్ నుంచి మందు తేవాలి

ఎడపిల్లవాడిని—ఇంట్లో వుంటే తల్లిని పనిచేసుకో నివ్వడు గనక — ఎక్కైనా షికారు తిప్పి తీసుకురావాలి

మధ్య మధ్య చెల్లెమ్మ కొన్నాళ్లప్పుడు— వంట వచ్చినవాడు కావటాన ఆ డ్యూటీ అతనిదే !

ఊపిరి తిరగని పనులతో సీతారామయ్య చిక్కి సగమవుతున్నా, 'ఏరా, అన్నయ్యా మా సంసారంతోనే నీ జీవితాన్ని తెల్లవా ర్చేసుకుంటున్నావు నీ సంగ తెప్పుడు చూచు కుంటావు' అని చెల్లెమ్మగానీ, బావగారు గానీ అడగరేమని ఇరుగూ, పొరుగూ చెవులు కొరుక్కునేవారు.

అవేవీ తనకు పట్టనట్టు తిరుగు తున్న సీతారామయ్యను ఒకరు సాహసించి అడిగేశారు కూడా నవ్వేసి 'ఆ నేను తప్పుకుంటే చెల్లెమ్మొక్కర్తీ అంత సంసా రంతో ఎలా నెట్టుకొస్తుంది' అన్నాడు సీతారామయ్య

ఎదురింటి సుబ్బయ్య పెళ్ళాంతో 'చూశావటే ఆ నిబ్బరం ఏదీ—మీతమ్ము డూ ఉన్నాడు, ఎందుకూ అటునుంచి నన్నే ఉద్ధేస్తున్నాడు' అన్నాడు 'చాల్లెండి. మీ గడుసు కబుర్లకేమొచ్చె ఆ సీతారామయ్య కెందుకొచ్చిన తిప్పలవి ? ఏనాటికైనా తన వాళ్ళవుతారు గాని అంత్యకాలం వస్తే ఈ చెల్లెలూ పిల్లలూ కాలుకా, చెయ్యికా ఆసరా అయ్యేది? వంట్లో ఓపికా, చేతిలో డబ్బూ ఉన్నన్నాళ్ళు అలా పీక్కుతింటారు ' విరు చుకు పడింది సుబ్బయ్య పెళ్ళాం.

నాలుగు పదులు నిండిన సీతారామయ్యకి ఒక సంబంధం కుదుర్చుకొని వచ్చాడు బావమరిది అమ్మాయికి నా అన్నవాళ్లెవరూ లేరు టైపిస్టు పని చేస్తున్న ఆఅమ్మాయి సీతారామయ్యకు ఈడే అవుతుంది సీతారా మయ్య ఈ వివాహానికి యిష్టపడితే అందరూ కలిసి ఒకే ఒక కప్పు క్రింద తోడు నీడగా ఉండవచ్చు బావమరది చెప్పిన భోగట్టా విని, చెల్లెలి బలవంతం మీద వెళ్లి ఆ అమ్మాయిని చూసి వచ్చాడు, సీతారామయ్య. త్వరలోనే ఆ యింట్లో ఒక గది సీతారా మయ్య దంపతులకు ప్రత్యేకించబడింది

ఇప్పుడు సీతారామయ్యకు కాలం ఎంత మధురంగా గడుస్తూందో, అంత అసం తృప్తిగానూ నడుస్తూంది భద్రాచలం, వాణి విసరే విసుర్లు, వెలిబుచ్చే అసంతృప్త ధోరణులు, బయల్పరిచే నర్మగర్భ సంభా షణలు ఆ దంపతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నవి తమ ఉనికి వాళ్లకి అంత కిట్టనపుడు పట్టుదలగా ఈ పెళ్లి జరిపించడం దేనికి ? లోకం నోళ్లు మూయించడానికా ?

స్వతహా అభిమాని అయిన సీతారామయ్య భార్య కామేశ్వరి తానిది సహించలేక, తగినట్టు వెంటవెంటనే జవాబులు ఇచ్చేది

రాయిరా, రాయిరా రాపిడి అవాలేగాని, అగ్ని ఎంతసేపటిలో పుట్టారి ?

నాలుగురోజులకోమారైనా ఆ ఇంట్లో ప్రచ్ఛన్నసమరం జరిగేది

కామేశ్వరి ఓనాడు భర్తని అడిగేసింది. 'మన కష్టం మనం పడుతూ ఎందు కొచ్చిందీ కొలువు ? ఈ ఇల్లు వదిలిపోదాం కసుర్లుతినడానికి, చాకిరీ చెయ్యడానికి మీకైతే చెల్లెలూ, పిల్లలేమోగాని, నాకేమీ కారు వీళ్లు.'



సీతారామయ్యకు చెల్లెళ్ళు, పెళ్ళాన్ని వదిలి వెళ్ళటం ఇష్టంలేదు ప్రతిదానికీ మాటికీ జగడాలతో హోరెత్తే ఆ ఇంట్లో మసలటమూ ఇష్టంలేకపోతూందీమధ్య తటస్థంగా వుండి పోయిన భర్త వైఖరిని చేతకానితనంగా ఎంచి 'ఇహ నేను పిల్లలతో అడ్జస్ట్ అయివుండ లేను మీ ఇష్టం. నాతో వస్తేరండి లేకుంటే ఉండండి' అని బయల్దేరింది కామేశ్వరి భార్యకు ఇక అభ్యంతరం చెప్పలేక తనూ ప్రయాణమయ్యాడు సీతారామయ్య

భద్రాచలం బావగారిమీద ఎగిరిపడ్డాడు. 'ఇంతకాలం నా ఇంటవుండి నా పిల్లలు విడిగేవేళకు నీ త్రోవ నువు చూసుకుంటు న్నావు. కృతఘ్నత మంచిదికాదు' అని నిందించాడు.

ఆవాక్కుయిన సీతారామయ్య అడుగు కదపనేలేకపోయాడు

'చెల్లెలి పంచన చేరినవాడివి పౌరుషం, అభిమానం లేని మగాడివి!' అని ఛీత్కారం చేసి వెళ్ళిపోయింది కామేశ్వరి

'పోతే పోయింది. లోపలికి రా మంచికీ, మర్యాదకూ విలువ ఇవ్వటం ఎంతమందికి చాతనౌవుతుందిలే' అని అన్నగారి చెయ్యి పట్టుకుని ఇంట్లోకి తీసుకువెళ్ళింది వాణి కళ్ళనీళ్ళు పెట్టుకొని 'అమ్మా, నాన్నా వుంటే నన్నిలా నడిసముద్రంలో ఓడలా వదిలేద్దురా నువ్వు ఉన్నందుకు వాళ్ళులేని లోటు పూడ్చవలసిన బాధ్యత నీకు ఉందం టావా, లేదురా?' అంటుంటే కరిగి

పాపం సీతారామయ్య

నీరయ్యాడు సీతారామయ్య

ఆవిధంగా సీతారామయ్య దాంపత్యం మూన్నాళ్ళ ముచ్చటయింది.

సీతారామయ్య చెల్లెలూ, బావమరిదీ చెప్పినట్టు కామేశ్వరి మర్యాదా, మన్ననా లేని ఆడదని భర్తకు గౌరవం ఇవ్వనేర్వని దంటే నమ్మాడుగాని, స్త్రీ తన భర్తలో అన్ని అవగుణాలకంటే ఎక్కువగా చేతకాని తనాన్నే క్షమించలేదని గ్రహించలేక పోయాడు.

మరొక పదేళ్ళు కాలంలో కలిసి పోయాయి. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు వయసు పెరిగి బుద్ధి మందగించినదేమో, వాళ్ళు పెంచిన మేనమామనే ద్వేషించారు దూషించారు

సీతారామయ్య, భద్రాచలం చెరొక అయిదువేలు వేసుకొని కట్టించిన డాబా ఇల్లు, అతను పిల్లలకోసం ముచ్చటపడి కొన్న బీరువాలలో ఒకటి సీతారామయ్యను ఆ ఇంటినుంచి నడిపించడానికి కారణ మయ్యాయి 'ఖర్మం చాలక' అన్నట్టు దొంగలుపడి బీరువా ఎత్తుకుపోయారు గాలివానొచ్చి కొత్తడాబా చిల్లుపడింది

'ఎప్పటికైనా పరాయివాడివే అనిపించా వులే, మామయ్యా' అన్నాడు పెద్ద మేనల్లుడు

మిగిలిన బీరువాకూడ తీసేసుకో!' అని

[illegible]

'ఎవరిలో అన్నట్టు చూస్తూ వూరు కుంటే ఇల్లు తగలబడక ఏమవుతుంది? ఎంత సొమ్ము తినేశాడో, ఏమిటో, ఆ మేస్త్రీ వెధవ!'

పెద్ద మేనకోడలు మామయ్యకి వినిపిం చేలా తల్లిదగ్గర అరిచింది.

సీతారామయ్యలో సహనం చచ్చిపోయింది. నాలిక తడిచేసుకొని 'అయితే ఇదంతా నా కోసమట్రా చేశానూ' అని అరిచాడు, కీచుగా.

'కాక, మరేమిటి? పైకి మాకే అంతా పెడుతున్నట్టు నటన! లోకం దృష్టిలో సర్వం త్యజించిన పెద్దమనిషి అని అని పించుకోవాలని తాపత్రయం! ఈ చేత్తో ఇచ్చి, ఆ చేత్తో చాటుగా పెళ్ళానికి చేర వేస్తున్నావని ఎవరనుకుంటారు?'

తల్లీ, తండ్రీ అక్కడ ఉండగానే పెద్ద మేనల్లుడు ధైర్యంగా మాటలు విసరడం సీతారామయ్యకే ఏవగింపు కలిగించింది

'సరి! మీరందరు కలిసి నా కిన్నాళ్ళ కైనా బుద్ధి గరపించారు ఒరే గోవిందా! నాపొరుగు మీకు కిట్టనపుడు ఇన్నిడొంక తిరు గుళ్ళు లేకపోతే, సొమ్మని ఒక్కముక్క చెప్ప రాదుట్రా' అనేసి, ఇంటికీ, తనకీ ఋణా నుబంధం తీరిపోయిందనుకుని చెప్పేశాడు.

కామేశ్వరి పనిచేసే ఆఫీసుకి వెళ్ళి వాకబు చెయ్యగా, ఆవిడ ఎనిమిదేళ్ళ క్రితమే హైద్రాబాదు బదిలీ అయి వెళ్ళిపోయిం దని తెలిసింది.

అ[డసు సంపాదించి, తన ఇల్లు వెదు క్కుంటూ వచ్చిన భర్తను చూచి కామేశ్వరి ఆశ్చర్యపోయింది ఏదో ఒకనాటికి అతను తన ఉనికి వెదుక్కుంటూ వస్తాడన్న భావన ఆమెకు అప్పుడే కలిగినా, తనది భ్రమేమో అని వూరుకుంది తన ఆలోచన తప్పలేదన్న గర్వం, ఆనందం ఆమెకిప్పుడు కలిగాయి ఆర్ద్రమైన హృదయంతో ఆ అమాయకుణ్ణి మరల తన జీవితంలోకి ఆహ్వా నించింది

ఆ తరువాత నాలుగేళ్ళు ఏం గడిచాయో అంతే! కామేశ్వరికి మసూచి సోకి భర్త చేతుల్లో చనిపోయింది.

* *

'టక్' మని మరొక గడ్డిపోచ పడింది.



'పోస్ట్!' ఉలిక్కిపడి, లేచి వెళ్ళి అదిరే గుండెతో టెలిగ్రాం అందుకున్నాడు సీతారామయ్య.

'వాణికి సీరియస్‌గా ఉన్నది ప్రతి నిముషానికీ మిమ్మల్నే కలవరిస్తున్నది. వెంటనే బయల్దేరి రావాలెనని కోరుతున్నాను.

—భద్రాచలం.

గాభరాగా పంచె సర్దుకుని, చొక్కా వేసుకుని, చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు, సీతారామయ్య, 'వస్తున్నాను' అని వైరిచ్చేందుకు.

ధప్పుమని పడిపోయిన గూటిని చూస్తూ గోల చేస్తున్నాయి పిచ్చుకలు రెక్కలు టపటపమని కొట్టుకుని మరిన్ని గడ్డిపోచలు తెచ్చేందుకు అవతలికి రివ్వున ఎగిరిపోయాయివి. ●